సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

● ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు
● ఉత్సాహంగా 'వై ఏపీ నీడ్స్ జగన్'

విద్యాధరపురం(విజయవాడపశ్చిమ): దేశ చరిత్రలోనే ఎక్కడ లేని విధంగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలను నేరుగా ప్రజల ముంగిటకే తీసుకువెళ్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. 49వ డివిజన్ టైలర్‌పేటలోని 169వ వార్డు సచివాలయ పరిధిలో బుధవారం జరిగిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, స్థానిక కార్పొరేటర్ బుల్లా విజయ్‌కుమార్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ముందుగా గాంధీ విగ్రహం వద్ద పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం సచివాలయంలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల బోర్డును ఆవిష్కరించారు.

వైద్య, ఆరోగ్య రంగంలో సరికొత్త విప్లవం

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో జగనన్న పాలనకు, గత చంద్రబాబు పాలనకు మధ్య వ్యత్యాసాన్ని ఎమ్మెల్యే వెలంపల్లి ప్రజలకు వివరించారు. ఎన్నికల్లో గెలిచినప్పటి నుంచి జగన్‌మోహన్ రెడ్డి అన్ని వర్గాల ప్రజలను సమానంగా చూస్తున్నారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా దేశ చరిత్రలోనే తొలిసారి ప్రజల వద్దకు పాలన చేరువ చేసి పెద్ద ఎత్తున సంక్షేమాన్ని అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో 85 శాతం మంది ప్రజలకు ఏదో ఒక పథకం రూపంలో ఈ ప్రభుత్వం మేలు చేకూర్చిందని చెప్పారు. నగరంలో లక్ష మందికి ఇంటి స్థలాలు మంజూరు చేయగా అందులో పశ్చిమ నియోజకవర్గంలోనే 31 వేల మంది లబ్ధిదారులు ఉన్నారన్నారు. అందులో మొదటి విడతగా 10 వేల ఇళ్ల నిర్మాణాలు చేపట్టామని, త్వరలోనే లబ్ధిదారులకు అందజేస్తామని తెలిపారు. రాష్ట్రంలో వైద్యం కోసం ఏ ఒక్క పేదవాడు అప్పులపాలు కాకూడదన్నదే సీఎం జగన్ తాపత్రయమని, అందుకోసం వైద్య ఆరోగ్య రంగంలో సరికొత్త విప్లవం తీసుకువచ్చారన్నారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచడం ముఖ్యమంత్రికి ప్రజల ఆరోగ్యం పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని తెలిపారు. స్థానిక డివిజన్ కార్పొరేటర్ విజయ్‌కుమార్ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని, వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్తే తక్షణమే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని తెలిపారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన 49వ డివిజన్ కార్పొరేటర్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రుహుల్లా, పార్టీ డివిజన్ అధ్యక్షుడు గౌడుపేరు సుధీర్, నాయకులు మనోజ్ కొఠారి, యర్రజోన్న విజయలక్ష్మి, తంగిరాల ప్రమీల, జార్జి, మార్కు, వెంకన్న, సచివాలయ సిబ్బంది, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.



టైలర్‌పేటలో పార్టీ జెండాను ఆవిష్కరించిన ఎమ్మెల్యే వెలంపల్లి, ఎమ్మెల్సీ రుహుల్లా, మేయర్ భాగ్యలక్ష్మి

వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని రాష్ట్ర ప్రజానీకం ఆకాంక్షిస్తుందని ఏపీ జైన్ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్ కొఠారి పేర్కొన్నారు. నియోజకవర్గంలోని 38వ డివిజన్ 194 సచివాలయ పరిధిలోని కుమ్మరిపాలెం సెంటర్‌లో బుధవారం జరిగిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత సచివాలయ పరిధిలో ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా పేదలకు చేకూరిన లబ్ధితో పాటు జరిగిన అభివృద్ధికి సంబంధించిన వివరాలతో కూడిన డిస్ ప్లే బోర్డ్‌ను ఆయన స్థానిక కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసాతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్ సీపీ పతాకాన్ని ఎగురవేశారు. మనోజ్ కొఠారి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వానికి, గత టీడీపీ ప్రభుత్వానికి ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలకు వివరించేందుకే 'ఏపీకి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. సంక్షేమ పథకాలు యథాతథంగా కొనసాగాలంటే రాష్ట్రానికి వైఎస్ జగన్ అవసరమని అన్నారు. గడిచిన నాలుగున్నరేళ్లలో సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా సీఎం జగన్ పాలన సాగిందన్నారు. గత టీడీపీ పాలనలో ప్రజలను గ్రాఫిక్స్‌తో మభ్యపెట్టి మోసం చేశారని కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా అన్నారు. ఎస్కే నజీర్, బొమ్ము మధు, విజయ్, వినోద్, కరిముల్లా, బి.శాంతి, కర్రి మల్లికార్జునరావు, సూర్య, కాటన్ కరిముల్లా, బూదాల శ్రీను, లేళ్లపూడి లాజర్, జోసఫ్ శివమణి పాల్గొన్నారు.



38వ డివిజన్‌లో డిస్ ప్లే బోర్డ్‌ను ఆవిష్కరించిన మనోజ్ కొఠారి, రెహమతున్నీసా

వైఎస్సార్ బీమా నగదు అందజేత



భవానీపురం(విజయవాడపశ్చిమ): మృతి చెందిన పేద కుటుంబాలకు వైఎస్సార్ బీమా ఆసరాగా నిలుస్తుందని 47వ డివిజన్ కార్పొరేటర్ గోదావరి గంగ అన్నారు. డివిజన్‌లోని 47వ సచివాలయం పరిధిలో నివసిస్తున్న వి.అయ్యప్ప ఈ నెల 18వ తేదీన మరణించారు. దీంతో వైఎస్సార్ బీమా పథకం కింద మట్టి ఖర్చుల కింద అతని నామినీ అయిన స్వర్ణలక్ష్మికి కార్పొరేటర్ గోదావరి గంగ రూ.10 వేల నగదును అందజేశారు. ఈ సందర్భంగా గోదావరి గంగ మాట్లాడుతూ వైఎస్సార్ బీమా పథకం కింద అందించే మిగిలిన నగదును త్వరలో నామిని బ్యాంక్ ఖాతాలో జమ చేస్తామన్నారు. సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం పరిధిలోని 11 కేవీ టీచర్స్ కాలనీ ఫీడర్ కొత్త లైన్ల పనుల కారణంగా గురువారం కొన్ని ప్రాంతాల్లో నాలుగు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు దర్గా ప్లాట్స్‌లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

క్లుప్తంగా

దుర్గమ్మ సేవలో కార్మిక, పరిశ్రమల శాఖ కార్యదర్శి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను రాష్ట్ర కార్మిక, పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎం.హరిజవహర్ లాల్ బుధవారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన హరిజవహర్ లాల్ దంపతులకు ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం, ఈఓ కె.ఎస్.రామారావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, పట్టువస్త్రాలను అందజేశారు.

అమర జవాన్ల కుమార్తెలకు ల్యాప్‌టాప్‌ల వితరణ

విజయవాడస్పోర్ట్స్: యుద్ధంలో అమరులైన జవాన్ల కుమార్తెలకు అధర్వ ఫౌండేషన్ సభ్యులు ప్రొఫెసర్ సందీప్ గొండే, ప్రొఫెసర్ బాలాజీ షిండే ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేశారు. అధర్వ ఎడ్యుకేషన్ ట్రస్ట్, అధర్వ ఫౌండేషన్ చైర్మన్, బోరవాలి(ముంబై) శాసన సభ్యుడు సునీల్ రాణే సమకూర్చిన ల్యాప్‌టాప్‌లను విజయవాడలోని సైనిక సంక్షేమ శాఖ కార్యాలయంలో వారు బుధవారం అందజేశారు. యుద్ధంలో అమరులైన ఐదుగురు జవాన్ల కుమార్తెలకు ఒక్కొక్కరికి ఒక్కో ల్యాప్‌టాప్‌ను అందజేయడం పట్ల బ్రిగేడియర్ వి.వెంకటరెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఫౌండేషన్ దేశభక్తి స్ఫూర్తిని కొనియాడారు. సైనిక కుటుంబాల తరుపున ఫౌండేషన్ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 22న విశాఖపట్నంలో మరో ఐదుగురికి ఇదే విధంగా ల్యాప్‌ట్యాప్‌లను అందజేస్తామన్నారు.

క్యూ లైన్లలో ఈవో తనిఖీలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడి ఈవో కె.ఎస్.రామారావు బుధవారం క్యూ లైన్లను తనిఖీ చేశారు. అమ్మవారి దర్శనానికి చేరుకునే క్యూ లైన్లలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఇటీవల భక్తుల నుంచి ఫిర్యాదులు అందడంతో ఆయన బుధవారం క్యూ లైన్లను తనిఖీ చేశారు. స్టీల్ బ్యారికేట్స్‌కు వెల్డింగ్ చేయడం వల్ల ఇనుప ముక్కలు గీసుకుని గాయాలవుతున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. దీంతో ఆయన క్యూలైన్‌లో తనిఖీలు నిర్వహించి వెంటనే బ్యారికేట్స్‌ను సరి చేయాలని సూచించారు. అనంతరం మహా మండపం నాల్గవ అంతస్తులో పూజలు, ఫెస్టివల్ విభాగానికి చేరుకున్న ఈవో సిబ్బందికి పలు సూచనలు చేశారు. మహా మండపం లిఫ్ట్ వద్ద భక్తులతో మాట్లాడి వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అమ్మ వారి దర్శనానికి విచ్చేసిన పలువురు విదేశీ భక్తులతో ఈవో రామారావు మాట్లాడారు. అమ్మవారి ఆలయ విశిష్టతను వివరించడమే కాకుండా వారికి అమ్మవారి దర్శనం పట్ల వారు సంతృప్తిని వ్యక్తం చేయడంపై ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు.

గ్రూప్ 1, 2 పరీక్షల శిక్షణకు అధ్యాపకుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో విజయవాడలోని బీసీ స్టడీ సర్కిల్‌లో ఏపీపీఎస్సీ గ్రూప్-1, 2 ప్రిలిమినరీ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు శిక్షణ ఇచ్చేందుకు అర్హులైన అధ్యాపకులు నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21వ తేదీ గురువారంలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్, గ్రూప్-1, 2 పరీక్షలకు శిక్షణ ఇవ్వడంలో ఐదేళ్ల అనుభవమున్న అధ్యాపకుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన వారిని ఎంపిక కమిటీ ఎంపిక చేస్తుందన్నారు. అర్హులైన అధ్యాపకులు తమ బయోడేటా, అనుభవం సర్టిఫికెట్‌తో పాటు దరఖాస్తులను ఈ నెల 21వ తేదీలోగా బీసీ స్టడీ సర్కిల్ సంచాలకులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 95050 94349, 9966 849937 మొబైల్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

'ఆడుదాం ఆంధ్రా' విజయవంతానికి సమష్టి కృషి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ నెల 26 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 10వ తేదీ వరకు నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్రా క్రీడోత్సవాన్ని విజయవంతం చేసేందుకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంపై రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, క్రీడాభివృద్ధి అధికారులు, స్పోర్ట్స్ అంబాసిడర్స్‌తో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీసీకి జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ఢిల్లీరావు, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డీఎస్‌డీవో అజీజ్, జిల్లా స్పోర్ట్స్ అంబాసిడర్లు అనూష(సాఫ్ట్ టెన్నిస్), అబ్దుల్ రజాక్(ఫుట్‌బాల్)లతో కలిసి హాజరయ్యారు. క్రీడోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అనుసరించాల్సిన కార్యాచరణపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. జిల్లాలోని 605 సచివాలయాల పరిధిలో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ క్రీడలతో పాటు స్థానిక ప్రాధాన్యమున్న క్రీడలకు సంబంధించిన పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి క్రీడాకారుల రిజిస్ట్రేషన్, మైదానాల ఎంపిక, టీమ్ ఫార్మేషన్, స్పోర్ట్స్ కిట్ల పంపిణీ తదితర ప్రక్రియను సజావుగా చేపట్టినట్లు వెల్లడించారు. క్రీడల నిర్వహణకు ప్రత్యేక అధికారులను నియమించామన్నారు. ఆడుదాం ఆంధ్రాలో జిల్లాకు గుర్తింపు తీసుకువచ్చేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.



సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఢిల్లీరావు, అధికారులు, క్రీడాకారులు

23న వైకుంఠ ఏకాదశి

చిట్టినగర్ ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లోని శ్రీ పద్మావతి, గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. స్వామి వారు ఉత్తర ముఖంగా భక్తులకు దర్శనమివ్వనుండటంతో ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ పేర్కొంది. తెల్లవారుజామున 4 గంటల నుంచే స్వామి వారికి అభిషేకాలు, అర్చనల అనంతరం దర్శనానికి అనుమతిస్తామన్నారు. స్వామి వారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. స్వామి వారిని దర్శించుకున్న భక్తులకు దక్షిణావృత శంఖంతో తీర్థం ఇవ్వనున్నారు. సాయంత్రం స్వామి వారి నగరోత్సవ సేవ వైభవంగా నిర్వహిస్తారు. చిట్టినగర్‌లోని స్వామి వారి ఆలయం నుంచి ఊరేగింపు ప్రారంభమై కేటీ రోడ్డు, నెహ్రూబొమ్మ సెంటర్, కోమల విలాస్ మీదుగా బ్రాహ్మణ వీధి, శ్రీనివాసమహల్ మీదుగా ఆలయానికి చేరుకుంటుంది.



చిట్టినగర్‌లోని శ్రీవెంకటేశ్వరస్వామి వారి ఆలయం

ఎన్ఎస్ఎం స్కూల్ స్వర్ణోత్సవాలు ప్రారంభం

పటమట(విజయవాడతూర్పు): పటమటలోని ఎన్ఎస్ఎం స్కూల్ స్వర్ణోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. పాఠశాల ప్రాంగణంలో మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా తొలి రోజు పాఠశాల ప్రైమరీ విభాగం స్వర్ణోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో హైదరాబాద్ ప్రావెన్స్ ప్రావెన్షియల్ సుపీరియర్ షైన్ అలెక్స్, పాఠశాల పూర్వ విద్యార్థి, అమెరికాకు చెందిన టీఏవో డిజిటల్ సొల్యూషన్స్ అధినేత వెలగపూడి రాజ్‌కుమార్, పీవీపీ వెంచర్స్ ఎండీ పొట్లూరి వరప్రసాద్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు కేవలం విద్యకే పరిమితం కాకుడా సాంస్కృతిక అంశాలు, క్రీడలు తదితర విభాగాల్లో ప్రావీణ్యం పొందాలన్నారు. పొట్లూరి వరప్రసాద్(పీవీపీ) మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతో పాటు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన రిథమ్ ఆఫ్ జాయ్, విభిన్న సంస్కృతులను వివరించిన ఏస్టార్ వాజ్ బార్న్ నృత్యం, స్ప్రింగింగ్ పార్క్స్, విద్యార్థులు ఆలపించిన గీతాలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అసిస్టెంట్ జనరల్ బ్రదర్ ప్రతాప్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ రాయప్పరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ బాలారెడ్డి, కరస్పాండెంట్ మౌంట్‌ఫోర్ట్, పాఠశాల అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు

● అట్టహాసంగా జననేత జన్మదిన వేడుకలు





రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని ఎమ్మెల్సీ, సీఎం కార్యక్రమాల సమన్వయకర్త తలశిల రఘురాం ఆధ్వర్యంలో గొల్లపూడి గ్రామంలో బుధవారం నిర్వహించిన వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ట్రాలీపై భారీ కేక్‌ను ఏర్పాటు చేసి మైలురాయి సెంటర్ నుంచి గొల్లపూడి పంచాయతీ కార్యాలయం వద్దకు ర్యాలీ చేపట్టారు. పెద్ద సంఖ్యలో పార్టీ నేతలు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

కొండ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు



చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): కొండ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కృషి చేస్తున్నామని 48వ డివిజన్ కార్పొరేటర్ అత్తులూరి ఆదిలక్ష్మి పేర్కొన్నారు. చిట్టినగర్ సొరంగం రోడ్డు సాధుజాన్ వీధి బూస్టర్ వద్ద సీసీ రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం కార్పొరేటర్ ఆదిలక్ష్మి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజలు తాము ఎదుర్కొంటున్న అనేక సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కొండ ప్రాంతాల్లో డ్రెయిన్లు, మెట్లకు మరమ్మతులు, మంచినీటి పైపులైన్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి అత్తులూరి పెదబాబు, డివిజన్ అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు, తొత్తడి వరలక్ష్మి, గాలి గురుప్రసాద్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేయాలి



రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్లు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని 53వ డివిజన్ కార్పొరేటర్ మహాదేవు అప్పాజీరావు అన్నారు. గణపతిరావురోడ్డు, టీపీ రోడ్డులను సుమారు ఆరు కోట్ల రూపాయలతో నిర్మాణం, విస్తరణ, అభివృద్ధి పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పనులను స్థానిక కార్పొరేటర్ అప్పాజీరావు ఇతర కార్పొరేటర్లు బుల్లా విజయకుమార్, మరుపిళ్ల రాజేష్, అబ్దుల్ ఆర్షద్‌లతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్థానిక శాసనసభ్యుడు వెలంపల్లి శ్రీనివాసరావు చొరవతో టీపీ రోడ్డు, గణపతిరావు రోడ్డుల నిర్మాణానికి ఆరు కోట్ల మంజూరయ్యాయన్నారు. ఎంతో ఇబ్బందులు ఉన్న రహదారులను మరింత అందంగా తీర్చిదిద్ది ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామని చెప్పారు. కొన్ని పనులు చివరి దశలో ఉన్నాయన్నారు. వాటిని సైతం త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వేడుకగా చిన్నయ సూరి జయంతి



విజయవాడ కల్చరల్: బహుముఖ ప్రతిభాశీలి పరవస్తు చిన్నయ సూరి అని పరవస్తు చిన్నయ సూరి సాహితీపీఠం వ్యవస్థాపకుడు టి. శోభనాద్రి అన్నారు. చిన్నయసూరి సాహితీపీఠం ఆధ్వర్యంలో బందరురోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో బుధవారం చిన్నయసూరి 217వ జయంతి సభ నిర్వహించారు. భాషా వేత్త డాక్టర్ గుమ్మా సాంబశివరావు మాట్లాడుతూ చిన్నయ సూరి సంప్రదాయ విద్యలో తెలుగు సంస్కృత భాషలో విశేషమైన కృషి చేశారన్నారు. సాహితీవేత్తలు గోళ్ల నారాయణరావు, డాక్టర్ వెన్నావల్లభరావు, తిరువాయిపాటి మరోజ్‌కుమార్, దాస్యం మురళీధర్, డాక్టర్ తాళ్లూరి మనవాళ్ల సూరి, విద్యావేత్త డాక్టర్ ఎస్‌వీ రావు, వివిధ రంగాలకు చెందిన టి. శ్రీనాథ్ సూరి, యలకర కేశవాచార్యులు, పరవస్తు విజయబాబు, చిన్నయ సూరి సాహితీసేవలను వివరించారు. చిన్నయ్య సూరి జయంతి సందర్భంగా తెలుగు భాషా సేవకుడు డాక్టర్ గుమ్మా సాంబశివరావుకు పరవస్తు చిన్నయ సూరి స్మారక పురస్కారం అందించారు. కె. అనిల్‌కుమార్ సూరి, టి. శ్రీనివాసులు, వరయూరి మధుసూదనరావు, బీఆర్‌బీ ప్రసాద్, ఎంఎస్‌వీ ప్రసాద్, మోక్షం నాగలక్ష్మి, తొండా కనక దుర్గాదేవిలను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

సందడిగా పిల్లల పండుగ



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో జరుగుతున్న 6వ అమరావతి బాలోత్సవం రెండో రోజైన బుధవారం సందడిగా సాగింది. సీనియర్స్ విభాగం విద్యార్థులు చేసిన కోలాటం ఆకట్టుకుంది. జూనియర్స్ విభాగంలో విచిత్ర వేషధారణ, జూనియర్స్ లఘు నాటిక, సీనియర్స్ విభాగంలో క్లాసికల్, సీనియర్స్ దేశభక్తి గీతాలాపన, సబ్ జూనియర్స్ విభాగంలో కథలు చెప్పడం నిర్వహించారు. జూనియర్స్ పద్యం భావం చెప్పడం, తెలుగులో మాట్లాడడం, చిత్రలేఖనం, వ్యాసరచన, స్పెల్ బీ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వారిలోని ప్రతిభను చూపారు. ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, ఏలూరు జిల్లాలోని పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు.

నేడు బహుమతుల ప్రదానం

మూడు రోజుల పాటు జరిగిన బాలోత్సవంలోని వివిధ పోటీల్లో విజేతలకు గురువారం మధ్యాహ్నం 3 గంటలకు బహుమతుల ప్రదానోత్సవం నిర్వహిస్తామని అమరావతి బాలోత్సవం నిర్వాహకులు తెలిపారు.





